క్లుప్తంగా

క్షయవ్యాధిపై అవగాహన


అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రేణిగుంట: ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ టీబీ క్యాంపైన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, టీబీ నివారణ విభాగం సూపర్‌వైజర్ సుమశ్రీ పట్టణంలోని బుగ్గవీధిలో ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఎవరికైనా ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లోహిత, సూపర్‌వైజర్ అనురాధ, విశ్రాంత రైల్వే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారికి ఘన సత్కారం


ఏఓ భారతిని సన్మానిస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన భారతిని బుధవారం ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈమె నాగలాపురం మండల వ్యవసాయాధికారిణిగా బదిలీపై వెళ్లారు. ఆరేళ్లుగా ఏఓగా పనిచేస్తూ రైతులకు సేవలను అందించారని ఆమె సేవలను కొనియాడారు. బీఎన్ కండ్రిగ ఉపసర్పంచ్ మునిరాజా, సిబ్బంది రేవతి, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిగుండ ప్రవేశం

శ్రీకాళహస్తి: మండలంలోని ఊరందూరు హరిజనవాడలో రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయం ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఆయనకు నిర్వాహకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం, నాయకులు శరవణ, కంఠా ఉదయ్‌కుమార్, పెరుమాళ్ చౌదరి, మునికుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది డుమ్మా


ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిన ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పనిచేసే మండల స్థాయి అధికారులైన ఈఓపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విధులకు హాజరుకాకపోవడంతో వారి కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అందుకు సంబంధించి వాల్‌పోస్టర్లను డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళిందర్, శబరి రాజన్, గురుమూర్తి, సీతారాం, భాస్కర్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, చందు, ఆంటోని పాల్గొన్నారు.

ముగిసిన జాతర


నైవేద్యం తీసుకు వస్తున్న మహిళలు

రేణిగుంట: మండలంలోని రామకృష్ణాపురంలో ఉన్న అంకాల పరమేశ్వరి అమ్మవారి జాతర బుధవారంతో ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన జాతరలో బుధవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ప్రతిమ ముగ్గు వేశారు. గ్రామంలోని మహిళలు సామూహికంగా నైవేద్యం తీసుకువచ్చి, అమ్మవారికి సమర్పించారు. రాత్రి బ్యాండు వాయిద్యాలు, పంబ జోళ్ల దరువులు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కుంట్రపాకు మునికృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ పూజారి మునస్వామి, ఆర్కే యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేయాలి

నారాయణవనం: మంజూరైన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. మండలకేంద్రంలో రూ.16 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, 15 ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. చెత్త సేకరణకు ట్రైసైకిళ్లను, ప్లాస్టిక్ బుట్టలను పంచాయతీకి అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మించాల్సిన సీసీ రోడ్లను గురించి అంచనాలను తయారు చేయాలన్నారు.

కొల్లగొట్టు.. సిరులు పట్టు


గత వారం ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకుంటున్న జనసేన కార్యకర్తలు


తూకివాకం చెరువులో మట్టి తవ్వి లారీకి లోడ్ చేస్తున్న హిటాచీ

- విచ్చలవిడిగా ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు
- అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్ రేణిగుంట
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- కానరాని మైనింగ్ అధికారుల జాడ

కొందరు స్వార్థ పరులు ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. వారి బారి నుంచి ప్రకృతి సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలోనే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇకనైనా అధికారులు మేల్కొనకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

రేణిగుంట: ప్రకృతి సంపదైన మట్టి, ఇసుక, గ్రావెల్‌ను అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తమకు సంబంధం లేదన్నట్టు వ్యవహరించడంతో ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ రవాణాకు రేణిగుంట కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి నదిలో ఏడాదిగా రేయింబవళ్లు ఇసుక అక్రమంగా తవ్వి, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.


మట్టి తరలింపు కోసం వేచి ఉన్న లారీలు

పోలీసులు అప్పుడప్పుడు దాడులు చేసి, కొన్ని వాహనాలను సీజ్ చేస్తున్నారు. కానీ అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అధికారులు ఏమి చేయలేని నిస్సాయస్థితిలో ఉన్నారు. కరకంబాడి సమీపంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డే లేకుండా పోయింది. మండలంలో మైనింగ్ అధికారులు జాడ కనిపించడం లేదు. రెవెన్యూ అధికారులు తమకు మట్టి, ఇసుకతో సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హైవే పేరుతో అక్రమ తవ్వకాలు

పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పక్కనే తూకివాకం పెద్ద చెరువు ఉంది. హైవే విస్తరణ పనులకు మట్టి తవ్వకాలకు కలెక్టర్ నుంచి అనుమతులు ఉన్నాయని చెబుతూ వారం రోజులుగా విచ్చలవిడిగా మట్టి తవ్వుతున్నారు. 15 నుంచి 20 అడుగుల లోతు వరకు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. హైవే పేరు అడ్డుపెట్టుకుని ప్రైవేట్ వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సగం టిప్పర్లు ప్రైవేట్ వెంచర్లకు మట్టిని తరలించి, వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. స్థానిక అధికార పార్టీ ప్రజా ప్రతినిధి అండదండలుండడంతో అడ్డుకునేందుకు స్థానికులు సైతం భయపడుతున్నారు. కలెక్టరేట్‌కు అతి దగ్గరలోనే ఇంత జరుగుతున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యారు. నిజంగా హైవే పనులకు మట్టిని తవ్వేందుకు అధికారులు అనుమతులిస్తే అధిక లోతు లేకుండా ఒక క్రమ పద్ధతిలో మట్టిని తవ్వేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ తీర్మానం బేఖాతర్

తూకివాకం చెరువులో గతంలో పెద్ద పెద్ద గుంతలు తవ్వడంతో ఇద్దరు పిల్లలు గుంత ల్లో పడి మృతి చెందారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత పంచాయతీ పాలకమండలి చెరువులో ఎటువంటి మట్టి తవ్వకాలు జరపకూడదని తీర్మానం చేసింది. కానీ ఆ తీర్మానాన్ని సైతం లెక్కచేయకుండా ఇష్టానుసారంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు.

మట్టి కోసం చెరువు నీరు ఖాళీ

తూకివాకం చెరువులో ఎండాకాలం సైతం చెరువులో నీరు తగ్గే పరిస్థితులు లేవు. కానీ ప్రస్తుతం చెరువులో మట్టి తవ్వకాలు జరిపేందుకు స్థానిక అధికార పార్టీ నాయకులు చెరువు నుంచి నీటిని వృథాగా వదిలేశారని సమాచారం. చెరువులోని నీరు కిందికి వదిలేయడంతో ఎండిపోయి మట్టి తవ్వకాలకు అనువుగా మారింది.

అక్రమ తవ్వకాలను ఖండించిన జనసేన నేత

మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై గత వారంలో జనసేన రేణిగుంట మండల అధ్యక్షుడు నాగరాజు గాజులమండ్యం హరిజనవాడకు చెందిన యువకులతో కలిసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఇకపై ఇలాగే ఇసుక అక్రమ రవాణా జరిగితే తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌తో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని పత్రిక ప్రకటన ద్వారా ఇసుక అక్రమ రవాణా చేసే వారిని హెచ్చరించారు. కూటమిలో మిత్రపక్షమైన జనసేన నాయకులే అడ్డుకునే స్థాయికి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులదే



మండలంలో జరుగుతున్న ఇసుక, మట్టి, అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. ఇసుక అక్రమ రవాణా ఇలాగే కొనసాగితే మండలంలో ఇసుక కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఉచిత ఇసుక పేదలకు చేరడం లేదు. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

–హరినాథ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ గిరిజన సంఘం

ఆక్రమణ తొలగింపునకు యత్నం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా దేవుని బాటలో ఆలయానికి సంబంధించిన భూమిని సాగు చేస్తున్నారని హరితాభివృద్ధి సిబ్బంది ఆలయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈమేరకు బుధవారం ఆలయ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సిబ్బంది, ఉద్యోగులు అక్కడికి చేరుకుని ఆక్రమిత భూమికి ఫెన్సింగ్ వేసేందుకు యత్నించారు. అయితే సాగుచేస్తున్న వారు ఆలయ ఉద్యోగులపై దౌర్జన్యం చేశారని సమాచారం. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని సన్నిధి వీధిలో నాలుగు నెలల ముందు ఆక్రమణలు తొలగించి స్తంభాలు నాటారు. అయితే వారు మళ్లీ హద్దు దాటి చేసిన ఆక్రమణలను ఆలయ అధికారులు బుధవారం తొలగించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు

బుచ్చినాయుడుకండ్రిగ: తోతాపురి రకం మామిడి కాయలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.12వేలకు కొనుగోలు చేయాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఆమె మండలంలోని గాజులపెళ్లూరులో బుధవారం రసా ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో తోతాపురి రకం మామిడి కొనుగోలుపై చర్చించా రు. రైల్వేకోడూరు నుంచి వచ్చిన 9 లోడ్ల తోతా పురి కాయలను ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేయించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర టన్నుకు రూ.12 వేలకు తోతాపురి రకం మామిడి కాయలను కొనుగోలు చేయాలని, ఇందులో ప్రభుత్వం రూ.4 వేలు చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, వీఆర్‌ఓలు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సిబ్బంది భరత్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రేణిగుంట: మండలంలోని ఆయిల్ ఫ్యాక్టరీ కూడలిలో బుధవారం రూ.1.17 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. తుడా వారి సహకారంతో రేణిగుంట పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రా రెడ్డి పాల్గొన్నారు.

ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని రోటరీ క్లబ్ ఆవరణలో రోటరీ క్లబ్ శ్రీకాళహస్తి, తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. సుమారు వంద మంది ఈ శిబిరంలో పాల్గొని, పరీక్షలు చేయించుకున్నారు. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా చేశారు. స్విమ్స్ ఆస్పత్రి కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.హరిత, పీఆర్వో డి.చంద్రమోహన్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శైలజ, సెక్రటరీ సిద్దులుగారి ప్రసాద్, క్లబ్ సభ్యులు కండ్రిగ ఉమ, పాపగారి జనార్దన్, వెంకటముని, పార్థసారథి, కృష్ణ కుమార్, వేణుగోపాల్, బాలాజీ, జనిత, సుబ్రహ్మణ్యం, డాక్టర్ నారాయణ, డాక్టర్ వెంకట్రామన్, అనురాధ, సుబ్రమణ్యం రెడ్డి, ప్రమీలమ్మ, కళ్యాణి పాల్గొన్నారు.

ఆకాశవాణిలో కయ్యూరు కవితా పఠనం



తొట్టంబేడు: దిగువ సాంబయ్య పాళెం చెందిన ఉపాధ్యాయులు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారులు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం బుధవారం తిరుపతి ఆకాశవాణి కేంద్రంలో కవితా పఠనం చేశారు. బాలు స్వీయ రచన, స్వరంతో బాలగేయాలు, సామాజిక స్పృహ కవితలు, రికార్డింగ్ జరిగింది. దీనిని గురువారం ఉదయం 7.15 గంటలకు 103.2, 107.5 ఆకాశవాణి చానెల్‌లో ప్రసారం చేయనున్నట్లు ప్రోగ్రాం ఇన్‌చార్జ్ సుధాకర్ మోహన్ తెలిపారు.

సత్యవేడులో జాతర సందడి




గంగమ్మకు సారె తీసుకువస్తున్న బాలనాగాలమ్మ ఆలయ ధర్మకర్త రేవతమ్మ, విచిత్ర వేషాల్లో యువకులు, చిన్నారులు, విశేషాలంకరణలో గంగమ్మ

సత్యవేడు: పట్టణంలోని గంగమ్మ జాతర బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. రజకుల ఇంటిలో మహిషాసుర మర్దినిగా గంగమ్మ రూపాన్ని బంకమన్నుతో తయారు చేశారు. అమ్మవారికి విశేషపూల అలంకరణతో పచ్చల హారం, కాసుల హారం, మామిడిమాల, సూర్య చంద్రకళ కాళ్లగజ్జలు, ముక్కపుడక, త్రిశూలం, వెండి కిరీటం తొడిగారు. తదుపరి తప్పెట్లు, డప్పులు, బాణాసంచా పేలుళ్ల సందడి, విద్యుత్ దీపాల నడుమ అమ్మవారిని రజకులు వంతుల వారిగా తలపై మోస్తూ పట్టణంలోని గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లావువీధి, జయరాంబత్తుడువీధి, గంగమిట్టవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి గండుదీపం, వేపచీర మొక్కులు చెల్లించారు. బుధవారం రాత్రి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు గురువారం ఉదయం 6 గంటల వరకు సాగింది. నడివీధి గంగమ్మ వద్ద పర్ణశాలలో అమ్మవారు కొలువుదీరనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

గంగమ్మకు సారె సమర్పణ

జాతర సందర్భంగా బాలనాగాలమ్మ ఆలయ నిర్వాహకురాలు పి.రేవతమ్మ, భక్తబృందం కలసి బాలనాగాలమ్మ ఆలయం వద్ద నుంచి బండిపై 51 రకాల వస్తువులు, పట్టు చీర సారెను గంగమ్మకు సమర్పించారు. సురుటుపల్లి శ్రీ పల్లి కొండేశ్వర స్వామి దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పండ్లు, గాజులు పూలమాలలు, లడ్డు ప్రసాదాలతో సారెను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఈఓ పి.లత, మురళి(చికెన్ చిన్నా), ఆయల పూజారులతో కలసి గంగమ్మకు సమర్పించారు.

విచిత్ర వేషాలు

జాతర సందర్భంగా వేషాల సందడి నెలకొంది. యువకులు, చిన్నారులు పలు వేషాలలో సందడి చేశారు. దూరప్రాంతాలనుంచి వచ్చే సందర్శకులకు యువకుల వేషాలు కనువిందు చేస్తున్నాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటు చేసుకోకుండా డ్రోన్ నిఘాలో పకడ్బందీ చర్యలు చేసినట్లు సీఐ మురళీ నాయుడు తెలిపారు. భక్తుల రద్దీని దష్టిలో ఉంచుకొని ఈ ఏడాది జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచనల మేరకు డ్రోన్ నిఘా ఏర్పాటు చేశారు. బుధ, గురువారాలు రాత్రి, పగలు సత్యవేడులో డ్రోన్ నిఘా ఉంటుందని సీఐ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, నిషేధిత వస్తువులు క్రయ విక్రయాలు చేపట్టినా, జేబు దొంగలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముగ్గురు సీఐలు, 11 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు 25 మంది, కానిస్టేబుళ్లు 130 మంది, మహిళా కానిస్టేబుళ్లు 15, హోంగార్డులు 25 మంది, స్పెషల్ పార్టీ 16 మంది కలిసి 225 మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు. అ వాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే 94407 96766, 94407 96767కు సమాచారం అందించాలన్నారు.

ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోతే ఎలా?

సత్యవేడు: మండలంలో నిర్వహించే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసే కార్యక్రమాలకు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా మండల అధికారులు సమావేశాలు నిర్వహించడం ఏంటని ఎంపీపీ వి.ప్రతిమ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతుండగా ఎంపీపీ అడ్డుకొని గత వారం రైతులకు అందజేసిన సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఏఓ మురళి సమాధానం ఇస్తూ పొరబాటు అయిందని ఇకపై స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇస్తామని తెలిపారు. దాసుకుప్పంలో మద్యం షాపుల సమీపంలో అక్రమంగా బార్లు నిర్వహిస్తున్నారని, ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు అందుతుండడంతో పట్టించుకోవడం లేదన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురవుతున్నా అర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని దాసుకుప్పం సర్పంచ్ రవి రెడ్డి ఆరోపించారు. రాజగోపాలపురం సర్పంచ్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ హార్టికల్చర్ అధికారులు ప్రభుత్వం ద్వారా రైతులకు అందజేసే సబ్సిడీ పథకాలు, వాణిజ్య పంటల సాగుపై రైతు భరోసా కేంద్రాలు సమావేశాలు నిర్వహించి తెలపాలని హార్టికల్చర్ అధికారిణి రాధారాణిని కోరారు. స్థానికంగా పాలగుంటలోని క్యాఫ్రికాన్ జ్యూస్ ఫ్యాక్టరీ తోతాపురి(అంటి మామిడి) పండ్లు కొనుగోలు చేయడం లేదని ఆంబాకం ఎంపీటీసీ శరవణన్ ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలకు గైనకాలజిస్టు మహిళా డాక్టరు పోస్టు భర్తీ అయిందని, గర్భిణులు వైద్యశాలలో కాన్పు చేయించుకోవాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతిమ

గ్యాస్ పైప్‌లైన్లు, కేబుల్ పైప్‌లైన్ల కోసం రోడ్డుకు ఇరువైపులా తీసిన గోతులు త్వరగా పూడ్చేలా అధికారులు చొరవ చూపాలని సర్పంచులు కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ తరుణాక్షరెడ్డి, ఏఓ త్రివిక్రమ రావు, సీనియర్ అసిస్టెంట్ హేమభూషణం, ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, సీడీపీఓ దేవకుమారి, వైస్ ఎంపీపీ సరోజినీ, కో–ఆప్షన్ సభ్యురాలు మస్తానీ, ఎంపీటీసీలు రామయ్య, సెల్వి, బాలయ్య, సరవన, మోహన్‌రెడ్డి, నాగమ్మ, ఇంద్రాణి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి స్వాగతం

రేణిగుంట: తిరుపతి పర్యటన నిమిత్తం బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు విమానాశ్రయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, నేతలు స్వాగతం పలికారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
I.P. NO. 12 OF 2025

Between:
K.Srinivasa Rao, S/o Late Radha krishnaiah Chetty, R/at D. No. 10-113, Gandhi Road, Sathyavedu (V), (P.o) & (M), Tirupati (D.t), Presently R/at D. No. 2-59, Ananthapuram (V), Narasingarayanipeta (P.o), Chittoor rural (M) & (D.t)- 517 419, ...Petitioner

And:
P. Uma and others ...Respondents

NOTICE TO THE RESPONDENTS NO. 1 TO 4

To
1. **P.Uma**, W/o P. Ramesh, house wife, R/at Pallapu street, Sathyavedu (V),(P.o) & (M),Tirupati (D.t)- 517 588.
2. **K.Venkatesh**, S/o Not known, Tirumala milk business, R/at beside Naidu Hotel, Nethaji road, Sathyavedu (V), (P.o) & (M), Tirupati (D.t)-517 588.
3. **Chandramma**, W/o Salambai, Business, R/at Near Veterinary Hospital, Sathyavedu Sathyavedu (V), (P.o) & (M), Tirupati (D.t)- 517 588
4. **M.Rama Rao,** S/o Not known, Business, R/at Kummaragunta, Sathyavedu (V), (P.o) & (M), Tirupati (D.t)- 517 588.

Sir,
Please take notice that the above named Petitioner have filed the above Insolvency petition against you to declare him as Insolvent. The said IP is posted to **30-06-2025** for your appearance. Please be present on the said date before the said Court on: **30-06-2025 at 10-30 A.M.** either in persons or through an advocate and to file your objections if any, failing which the matter will be decided in your absence as ex-parte.

Sd/- **D.REDDEPPA REDDY**
Advocate for Petitioner.
Place: Chittoor. Date: 10-06-2025.

తొలిరోజు విద్యా కానుక అందేనా?

- మండల కేంద్రాలకు అరకొరగా చేరిన పుస్తకాలు
- మిగతా విద్యా సామగ్రి ఇంతవరకు చేరని వైనం
- నేడే పాఠశాలల పునఃప్రారంభం

వరదయ్యపాళెం: నియోజకవర్గ వ్యాప్తంగా నేడు పాఠశాలలు పునఃప్రారంభించనున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను కొంత మేరకు ఆయా మండల కేంద్రాలకు పంపిణీ చేసింది. ఇంగ్లీషు మీడియం పుస్తకాలతో పాటు మిగిలిన విద్యా సామగ్రి ఇంకా రాలేదు. దీంతో పాఠశాలలు తెరిచేలోపు విద్యాకానుకలోని అన్ని వస్తువులు విద్యార్థులకు అందేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వంలో విద్యాకానుకకు శ్రీకారం

పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులకు ఆర్థికభారం తల్లిదండ్రుల మీద పడకూడదని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాకానుక పంపిణీకి శ్రీకారం చుట్టింది. గణనీయమైన మార్పులను తీసుకొచ్చి నాణ్యమైన మధ్యాహ్న భోజనం నుంచి విద్యాసామగ్రిని విద్యార్థులకు అందించింది. అది కూడా పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అవసరమైన 7 రకాల వస్తువులను సమకూర్చి విద్యాకానుకను అందించేవారు.

సత్యవేడు నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 406 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 25,748 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో పాఠశాలల్లో కేవలం పాఠ్యపుస్తకాలను మాత్రమే అందించేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన అనంతరం విద్యా సంస్కరణలతో పలు మార్పులను తీసుకొని వచ్చారు. విద్యార్థుల చదువులకు ఏ తల్లిదండ్రులు కూడా ఇబ్బందులు పడకూడదని విద్యాకానుక పంపిణీకి శ్రీకారం చుట్టారు. విద్యాకానుకలో పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, స్కూలు బ్యాగు, షూస్, సాక్స్, బెల్టు, యూనిఫాం వంటి వాటితో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, పిక్చర్ డిక్షనరీలతో కూడిన విద్యాకానుక కిట్లు విద్యార్థులకు అందించేవారు. అదికూడా పాఠశాలలు పునఃప్రారంభం రోజే అందేవిధంగా చర్యలు తీసుకునేవారు.

కూటమి ప్రభుత్వంలో పేరు మార్పు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జగనన్న విద్యా కానుకకు పేరును సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా మార్చింది. అయితే ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, బెల్టులు మండల కేంద్రాలకు చేరాయి. కానీ మిగిలిన వస్తువులు స్కూల్ బ్యాగులు, షూ. సాక్సులు, టై, యూనిఫాం లాంటివి ఇంకా రాలేదు. అయితే గురువారం పాఠశాలల పునఃప్రారంభం కానున్నాయి. అయినా విద్యా సామగ్రి మాత్రం సరఫరా కాలేదు.

అందరికీ పంపిణీ చేస్తాం

నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వచ్చిన పుస్తకాలను ఆయా పాఠ శాలలకు చేరవేస్తున్నాం. బ్యాగు, యూనిఫాం, షూస్, సాక్సులు కూడా వచ్చాయి. వాటిని సైజుల వారీ వేరు చేసి పాఠశాలలకు పంపిణీ చేస్తున్నాం. మిగతావి వచ్చిన వెంటనే అన్ని పాఠశాలలకు 100శాతం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–గున్నయ్య, ఎంఈఓ, వరదయ్యపాళెం


వరదయ్యపాళెంలోని స్టాకు పాయింట్‌లో షూలను సైజుల వారీగా వేరుచేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

విద్యాకానుక కిట్..

విద్యాకానుక కిట్లో మూడు జతలు యూనిఫాం, రెండు జతల సాక్సు, మూడుసెట్లు నోట్ పుస్తకాలు (ఒక సెట్లో 6 పుస్తకాలు), ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, బెల్ట్, ఒక జత షూస్‌తో పాటు ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలు, పిక్చర్ డిక్షనరీలు వంటివి అందించాల్సి ఉంది. నియోజకవర్గంలోని స్టాక్ పాయింట్‌కు 90శాతం పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఇంకా 10శాతం రావాల్సి ఉంది. ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు అందలేదు. అలాగే యూనిఫాం, బ్యాగు, షూస్, సాక్సులు ఇంకా రావాల్సి ఉంది. అయితే పాఠశాలల తెరిచేలోపు విద్యాకానుక కిట్లు విద్యార్థులకు అందుతాయా? లేదా? అన్న సందేహంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.